


మన రాజధాని

APTEL/25/A5250

# రక్షణ

నిజం మా బలం

ఎడిటర్ నరేంద్ర

27.10.2026 మంగళవారం | సంపుటి (Volume): 1 సంచిక (Issue) : 97 | పేజీలు : 8 Pages : 4 | వెల : 4 | Published from : గుంటూరు

## తీవ్ర తుపానుగా బలపడిన 'అర్ణబ్'.. ఏపీ తీరం వైపు వేగంగా కదలిక!

ఎల్లుండి బాపట్ల-విశాఖ మధ్య తీరం దాటే అవకాశం

తీరం దాటే సమయంలో గంటకు 140 కి.మీ వేగంతో గాలులు

కోస్తాంధ్రలో రేపు, ఎల్లుండి భారీ నుంచి అతి భారీ వర్ష సూచన

ప్రజల కోసం విపత్తుల నిర్వహణ సంస్థ హెల్ప్‌లైన్ నంబర్లు జారీ



2



## ఎక్కడా కూడా ప్రాణ, ఆస్తి నష్టం

# జరగకూడదు..

### అధికారులకు చంద్రబాబు కీలక ఆదేశాలు

- అర్ణబ్ తుపాను ముప్పు నేపథ్యంలో సీఎం చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష
- ఎలాంటి నష్టం జరగకుండా చూడాలని అధికారులకు స్పష్టమైన ఆదేశం
- బాపట్ల-విశాఖ మధ్య తీరం దాటే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిక
- గంటకు 140 కిలోమీటర్ల వేగంతో గాలులు, ఏపీ తీరానికి రెడ్ అలర్ట్ జారీ
- తీరప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని కలెక్టర్లకు సూచన

## రేపు, ఎల్లుండి అతి భారీ వర్షాలు..
## గంట గంటకూ పరిస్థితి సమీక్షిస్తోన్న చంద్రబాబు

బంగాళాఖాతంలో 'అర్ణబ్' తుపాను

యానాం వద్ద ఈ నెల 28న తీరం దాటనున్న తుపాను

కోస్తాంధ్రలోని 11 జిల్లాల్లో

భారీ నుంచి అతి భారీ వర్షాలకు అవకాశం

ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టిన ప్రభుత్వం

లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలింపు

2





2

## ఎన్టీఆర్ దూరదృష్టి ప్రశంసనీయం

**ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్**

విజయవాడలో ఎన్టీఆర్ వర్సిటీ 40వ వార్షికోత్సవం

ముఖ్య అతిథిగా ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్

విద్యా, వైద్య రంగాలకు ఎన్టీఆర్ సేవలను కొనియాడిన ఉపరాష్ట్రపతి



2

### రేపు, ఎల్లుండి సొంత నియోజకవర్గంలో జగన్ పర్యటన

జగన్ రెండు రోజుల పులివెందుల పర్యటన

రేపు ఉదయం పులివెందులకు చేరుకోనున్న మాజీ సీఎం

భాకరాపురం క్యాంపు కార్యాలయంలో ప్రజలకు అందుబాటు

రాత్రికి అక్కడే బస చేసి, బుధవారం తిరిగి తాడేపల్లికి పయనం



2

## ఆ ఒక్క పని చేయండి..
# 30 సెకన్లలో నిరసన ఆపేస్తాం

### ఢిల్లీ వ్యాపారులతో రాహుల్ గాంధీ

- నవంబర్ 1న తలపెట్టిన నిరసనపై షరతు పెట్టిన రాహుల్ గాంధీ
- ఆందోళన వాయిదా వేయాలన్న వ్యాపారుల అభ్యర్థనకు తిరస్కరణ
- సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగిస్తే నిరసన ఆగిపోతుందన్న రాహుల్
- పండుగ వేళ ఆందోళనతో రూ.10,000 కోట్ల నష్టం వస్తుందని వ్యాపారులు
- ఎలక్టోరల్ రోల్స్ సవరణపై సీఈసీ రాజీనామాకు విపక్షాల డిమాండ్

ప్రధాని నరేంద్ర మోదీ కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగిస్తే, తాము తలపెట్టిన ఆందోళనను 30 సెకన్లలోనే విరమించుకుంటామని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. నవంబర్ 1న ఢిల్లీలో విపక్ష 'ఇండియా' కూటమి తలపెట్టిన భారీ నిరసనను వాయిదా వేయాలని వ్యాపారులు కోరిన నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

## చెల్లి, మేనకోడలి విషయంలో జగన్
# భిన్నంగా వ్యవహరిస్తున్నారు

- వైసీపీ అధినేత జగన్‌పై
- మంత్రి నారా లోకేశ్ తీవ్ర విమర్శలు
- మేనకోడలి పెళ్లికి మేనమామగా దీవించాల్సింది పోయి అడ్డుకుంటున్నారని ఆరోపణ
- సొంత కుటుంబం పట్లనే అలా ఉంటే, రాష్ట్ర మహిళలను ఏం చూసుకుంటారని వ్యాఖ్య
- మంగళగిరి నియోజకవర్గంలో టీడీపీలోకి పలువురు వైసీపీ, సీపీఎం నేతల చేరిక

2



వైసీపీ అధినేత జగన్ పై ఏపీ మంత్రి నారా లోకేశ్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. సొంత కుటుంబ సభ్యుల విషయంలోనే జగన్ వ్యవహరిస్తున్న తీరు దారుణంగా ఉందని ట్వీట్ చేశారు. ప్రతి కుటుంబంలో మేనకోడలి పెళ్లికి మేనమామ అన్నీతానై ఆశీర్వదించి పంపుతాడని, కానీ జగన్ మాత్రం అందుకు భిన్నంగా ప్రవర్తిస్తున్నారని లోకేశ్ తెలిపారు.

## ఇలాగైతే ప్రజల మద్దతు పొందలేరు.. ఆ పార్టీ దుకాణం
# సర్దేసుకోవడం మంచిది



- స్థానిక ఎన్నికల్లో ఓటమి భయంతోనే వైసీపీ అల్లర్లకు పాల్పడుతోందన్న మంత్రి అనగాని
- పుంగనూరు, తిరుపతి సహా పలుచోట్ల దాడులే ఇందుకు నిదర్శనమని వెల్లడి
- ప్రజలు చంద్రబాబు అభివృద్ధి, సంక్షేమానికి మద్దతిస్తున్నారని స్పష్టీకరణ
- 11 సీట్లకు పరిమితం చేసినా జగన్ తీరు మారలేదని విమర్శ

2

స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటమి తప్పదనే భయంతోనే వైసీపీ రాష్ట్రవ్యాప్తంగా అల్లర్లు, విధ్వంసాలకు పాల్పడుతోందని రెవెన్యూ, రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ధ్వజమెత్తారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజల మద్దతు పొందలేకే జగన్ హింసా రాజకీయాలను ఎంచుకున్నారని ఆయన విమర్శించారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు.

# జగపతిబాబు టాక్ షోలో
# నారా లోకేశ్ సందడి..

### బాలయ్యకు ఎవరంటే భయం?

జగపతిబాబు హోస్ట్‌గా 'జయమ్ము నిశ్చయమ్మురా' టాక్ షో

మంత్రి నారా లోకేశ్ తో స్పెషల్ ఎపిసోడ్

స్కూల్ రోజుల్లో తన అల్లరి, పెళ్లి నాటి సరదా సంగతులు వెల్లడి

మామయ్య బాలకృష్ణకు ఒకే ఒక్క వ్యక్తి అంటే భయమంటూ ఆసక్తికర వ్యాఖ్య

లెజెండ్ సినిమాలోని పవర్ఫుల్ డైలాగ్‌తో ఆకట్టుకున్న లోకేశ్

విడుదలైన ప్రోమోకు వీక్షకుల నుంచి అద్భుత స్పందన

నిత్యం బిజీగా ఉండే ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, ప్రముఖ నటుడు జగపతిబాబు హోస్ట్‌గా వ్యవహరిస్తున్న 'జయమ్ము నిశ్చయమ్మురా' సెలబ్రిటీ టాక్ షోలో ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు. జీ5 ఓటీటీలో ప్రసారమవుతున్న ఈ షో సీజన్ 2లో లోకేశ్ పాల్గొన్న ఎపిసోడ్‌కు సంబంధించిన ప్రోమో విడుదలైంది. ఈ ప్రోమో ప్రస్తుతం సోషల్ మీడియాలో అందరి దృష్టిని ఆకర్షిస్తూ, ఆసక్తిని రేకెత్తిస్తోంది.




.. వివరాలు 2లో

## పురపోరులో కూటమి ప్రభంజనం..
## 17 మున్సిపాలిటీలు ఏకగ్రీవం



.. వివరాలు 3లో

726 వార్డులు, డివిజన్లు కూటమికి ఏకగ్రీవం

జగన్ సొంత జిల్లా కడపలోనూ కూటమి విజయకేతనం

పులివెందులలోనూ పలు వార్డులు ఏకగ్రీవం

పలుచోట్ల అభ్యర్థులను నిలబెట్టలేకపోయిన వైసీపీ

## హ్యాట్రిక్ విజయంపై భారత్ కన్ను!



.. వివరాలు 4లో

# చెప్పాం..చేస్తున్నాం

## 'బెల్' ప్రాజెక్ట్‌పై మంత్రి నారా లోకేశ్

- శ్రీ సత్యసాయి జిల్లాలో భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీఈఎల్) భారీ పెట్టుబడి
- రూ. 2,500 కోట్ల వ్యయంతో రక్షణ తయారీ యూనిట్ ఏర్పాటు
- స్థానిక యువతకు 800 ప్రత్యక్ష ఉద్యోగాల కల్పన
- ప్రాజెక్ట్‌ను అధికారికంగా ప్రకటించిన మంత్రి నారా లోకేశ్



3

## 'అర్ణబ్' తుపానుపై వదంతులు నమ్మొద్దు.

### అప్రమత్తతో గండం నుంచి బయటపడదాం: అచ్చెన్నాయుడు

బంగాళాఖాతంలో 'అర్ణబ్' తుపాను

రేపటికి అతి తీవ్ర తుపానుగా మారనున్న వైనం

అక్టోబర్ 28న బాపట్ల-విశాఖ మధ్య తీరం దాటే అవకాశం

ఏపీ, దక్షిణ ఒడిశా తీరాలకు రెడ్ అలర్ట్ జారీ

గంటకు 140 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే ప్రమాదం

అధికారిక సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలన్న మంత్రి అచ్చెన్నాయుడు

3



# ఎక్కడా కూడా ప్రాణ, ఆస్తి నష్టం జరగకూడదు..

మొదటి పేజీ తరువాయి

బంగాళాఖాతంలో ఏర్పడిన 'అర్ణబ్' తుపాను ఆంధ్రప్రదేశ్ తీరం వైపు దూసుకొస్తున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధికార యంత్రాంగాన్ని పూర్తిస్థాయిలో అప్రమత్తం చేశారు. తుపాను కారణంగా ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చూడటమే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని ఆయన స్పష్టం చేశారు. సోమవారం తన క్యాంపు కార్యాలయంలో ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షలో తుపానును ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఆయన కీలక ఆదేశాలు జారీ చేశారు. తుపాను గమనాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, దాని తీవ్రతకు అనుగుణంగా ప్రజలను అప్రమత్తం చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. "తుపాను ప్రభావంతో కురిసే వర్షాలు, వీచే గాలులు, సంభవించే వరద ప్రవాహాల తీవ్రతను ముందుగానే అంచనా వేయాలి. గతంలో వచ్చిన తుపానుల సమాచారాన్ని విశ్లేషించి రైతులకు, ప్రజలకు నిరంతరం హెచ్చరికలు జారీ చేయాలి. ఎలాంటి నష్టం జరగకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపైనా ఉంది" అని చంద్రబాబు అన్నారు. తీరప్రాంతాల్లోని ప్రజలను వెంటనే గుర్తించి, సమీపంలోని తుపాను షెల్టర్లకు తరలించాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, ఆర్టీజీఎస్, విపత్తు నిర్వహణ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. వివిధ జిల్లాల కలెక్టర్లు, పోలీసు అధికారులు వర్చువల్ విధానంలో హాజరై తమ జిల్లాల్లోని పరిస్థితులను, తీసుకుంటున్న చర్యలను ముఖ్యమంత్రికి వివరించారు. వాతావరణ శాఖ హెచ్చరికల ప్రకారం, 'అర్ణబ్' తుపాను అక్టోబర్ 26 అర్ధరాత్రికి తీవ్ర తుపానుగా, 27న అతి తీవ్ర తుపానుగా బలపడనుంది. అక్టోబర్ 28వ తేదీ ఉదయం బాపట్ల--విశాఖపట్నం మధ్య తీరం దాటే అవకాశం ఉంది. తీరం దాటే సమయంలో గంటకు 115 నుంచి 125 కిలోమీటర్లు, గరిష్ఠంగా 140 కిలోమీటర్ల వేగంతో పెనుగాలులు వీచే ప్రమాదం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో అక్టోబర్ 27, 28 తేదీల్లో భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని, అందువల్ల ఆంధ్రప్రదేశ్, దక్షిణ ఒడిశా తీరప్రాంతాలకు రెడ్ అలర్ట్ జారీ చేసినట్లు వాతావరణ శాఖ ప్రకటించింది.

# ఆ ఒక్క పని చేయండి.. 30 సెకన్లలో నిరసన ఆపేస్తాం

మొదటి పేజీ తరువాయి

వివరాల్లోకి వెళితే, ఎలక్టోరల్ రోల్స్‌లో ప్రత్యేక సవరణలకు (ఎస్ఐఆర్) సంబంధించి వచ్చిన ఆరోపణల నేపథ్యంలో సీఈసీ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ విపక్షాలు నవంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో భారీ నిరసన కార్యక్రమానికి పిలుపునిచ్చాయి. అయితే, నవంబర్ 8న దీపావళి, 6న ధన్‌తేరస్ ఉన్నందున, పండుగ సీజన్‌లో ఈ ఆందోళన నిర్వహిస్తే వ్యాపార కార్యకలాపాలకు తీవ్ర అంతరాయం కలుగుతుందని ఛాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ (సీటీఐ) ఆందోళన వ్యక్తం చేసింది. దీనివల్ల దాదాపు రూ.10,000 కోట్ల మేర నష్టం వాటిల్లుతుందని, కాబట్టి నవంబర్ 10 తర్వాత నిరసన చేపట్టాలని కోరుతూ రాహుల్ గాంధీకి లేఖ రాసింది. వ్యాపారుల అభ్యర్థనను రాహుల్ గాంధీ తోసిపుచ్చారు. ఈ విషయంపై ఆయన ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. ప్రభుత్వం మెట్రోను మూసివేసి, రోడ్లకు సీల్ వేసి, రాజధానిని లాక్‌డౌన్ చేసిందని, దొంగిలించబడిన ఓటుతో ఏదీ సురక్షితం కాదని విమర్శించారు. అనంతరం వ్యాపారులతో మాట్లాడుతూ, "నిందితుడు నంబర్ 4 అయిన జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించమని మోదీకి చెప్పండి. 30 సెకన్లలో నిరసనలు ఆగిపోతాయి" అని తేల్చిచెప్పారు. కేవలం ధన్‌తేరస్ రోజునే ఢిల్లీ మార్కెట్లలో సుమారు రూ.25,000 కోట్ల టర్నోవర్ జరుగుతుందని అంచనా. ఇంతటి కీలక సమయంలో ఆందోళన చేపట్టడంపై వ్యాపార వర్గాలు ఆందోళన చెందుతున్నప్పటికీ, సీఈసీ రాజీనామా విషయంలో వెనక్కి తగ్గేది లేదని విపక్షాలు స్పష్టం చేస్తున్నాయి.

# చెల్లి, మేనకోడలి విషయంలో జగన్ భిన్నంగా వ్యవహరిస్తున్నారు: నారా లోకేశ్

మొదటి పేజీ తరువాయి

దివంగత వైఎస్సార్ సొంత ఇంట్లో ఆయన మనవరాలి పెళ్లి జరగకుండా జగన్ అడ్డుకుంటున్నారని లోకేశ్ ఆరోపించారు. "సొంత చెల్లెలి విషయంలోనే ఇలా ప్రవర్తిస్తే, గత ఐదేళ్లలో రాష్ట్రంలోని మహిళలను, సోదరీమణులను ఆయన ఎలా చూసుకున్నారో ప్రజలకు ఇప్పటికే అర్థమైంది" అని లోకేశ్ వ్యాఖ్యానించారు. సొంత కుటుంబానికే న్యాయం చేయలేని వ్యక్తి, రాష్ట్ర ప్రజలకు ఏం చేస్తారని ఆయన ప్రశ్నించారు.

**లోకేశ్ సమక్షంలో చేరికలు**

మరోవైపు, ఉండవల్లిలోని తన నివాసంలో పలువురు నేతలను నారా లోకేశ్ టీడీపీలోకి ఆహ్వానించారు. మంగళగిరి నియోజకవర్గానికి చెందిన సీపీఎం నేతలు శివన్నారాయణ (కొలనుకొండ), ముసలి జ్యోతిబసు (ఆత్మకూరు)లతో పాటు వైసీపీ నేతలు నూతలపాటి చెన్నకేశవరావు (పేరుకలపూడి), ఉయ్యూరు వెంకటేశ్వరరావు (తుమరి), ముద్రబోయిన శ్రీను, షేక్ యూనిస్ (చిలువూరు) టీడీపీలో చేరారు. వీరందరికీ లోకేశ్ పసుపు కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానం పలికారు. వీరితో పాటు పెద్ద సంఖ్యలో వైసీపీ, సీపీఎం కార్యకర్తలు కూడా టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు.

# జగపతిబాబు టాక్ షోలో నారా లోకేశ్ సందడి.. బాలయ్యకు ఎవరంటే భయం?

మొదటి పేజీ తరువాయి



ఈ షోలో నారా లోకేశ్ తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన పలు సరదా విషయాలను పంచుకున్నారు. తన స్కూల్ రోజులను గుర్తుచేసుకుంటూ, తరగతిలో అందరికంటే ఎక్కువ పనిష్మెంట్లు తనకే పడేవని నవ్వుతూ చెప్పారు. "నిజంగానే అంత అల్లరి చేసేవారా?" అని జగపతి బాబు ప్రశ్నించగా.. "మామ య్యతో పోటీ పడాల్సి వచ్చేది" అంటూ లోకేశ్ చమత్కరించారు. తన పెళ్లికి ముందు జరిగిన ఓ సరదా సంఘటనను కూడా ఆయన ప్రస్తావించారు. తనను 'అల్లుడు గారు' అని పిలవగానే, ఏదో ఫిట్టింగ్ పెట్టేందుకు ప్లాన్ చేస్తున్నారని అనుమానం వచ్చిందని సరదాగా గుర్తుచేసుకున్నారు. ఇదే క్రమంలో, మామ నందమూరి బాలకృష్ణ గురించి మాట్లాడుతూ.. ఆయన జీవితంలో ఒకే ఒక్క వ్యక్తికి భయపడతారని చెప్పి సస్పెన్స్ క్రియేట్ చేశారు. ప్రోమో చివర్లో లోకేశ్, బాలయ్య ఐకానిక్ చిత్రాల్లో ఒకటైన 'లెజెండ్' సినిమాలోని "ఫ్లూటు జింక ముందు ఊదు.. సింహం ముందు కాదు!" అనే పవర్‌ఫుల్ డైలాగ్‌ను చెప్పి అందరినీ ఆకట్టుకున్నారు. కాగా, ఈ పూర్తి ఎపిసోడ్ నవంబర్ 6న జీ5లో ప్రీమియర్ కానుండగా, నవంబర్ 8న సాయంత్రం 7:30 గంటలకు జీ తెలుగు ఛానెల్‌లో ప్రసారం కానుంది.

# రేపు, ఎల్లుండి అతి భారీ వర్షాలు..

## గంట గంటకూ పరిస్థితి సమీక్షిస్తోన్న చంద్రబాబు

మొదటి పేజీ తరువాయి

బంగాళాఖాతంలో ఏర్పడిన 'అర్ణబ్' తుపాను నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు గంట గంటకూ పరిస్థితిని సమీక్షిస్తూ, రాష్ట్ర యంత్రాంగాన్ని సర్వసన్నద్ధం చేస్తున్నారు. ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా నివారించడమే లక్ష్యంగా ఆయన తన క్యాంపు కార్యాలయం నుంచి ఉన్నతాధికారులు, ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో వర్చువల్‌గా సమీక్షలు నిర్వహిస్తున్నారు. తుపాను గమనాన్ని, ప్రభుత్వ చర్యలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ కీలక ఆదేశాలు జారీ చేస్తున్నారు. భారత వాతావరణ విభాగం (ఐఎండీ) హెచ్చరికల ప్రకారం, అర్ణబ్ తుపాను రేపటికల్లా తీవ్ర తుపానుగా బలపడి రాష్ట్రంపై ప్రభావం చూపనుంది. ఈ నెల 28వ తేదీన బాపట్ల–విశాఖ మధ్య యానాం వద్ద ఇది తీరాన్ని దాటే అవకాశం ఉందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. తుపాను ప్రభావంతో రేపు మధ్యాహ్నం నుంచి ఉత్తర కోస్తాంధ్ర, కోనసీమ, ఉభయ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని తెలిపారు.

ఈ నెల 28, 29 తేదీల్లో కొన్ని చోట్ల అత్యంత భారీ వర్షాలు కూడా నమోదయ్యే అవకాశం ఉందని అంచనా వేశారు. తీరం వెంబడి బలమైన ఈదురు గాలులు వీస్తాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాష్ట్రం తీసుకుంటున్న చర్యలను కేంద్ర ప్రభుత్వానికి తెలియజేయాలని సీఎం అధికారులను ఆదేశించారు.



**లోతట్టు ప్రాంతాల ప్రజల తరలింపు, సహాయక చర్యలు**

తుఫాన్ నేపథ్యంలో ముంపునకు గురయ్యే లోతట్టు ప్రాంతాల ప్రజలను తక్షణమే సురక్షిత ప్రాంతాలకు, పునరావాస కేంద్రాలకు (షెల్టర్లకు) తరలించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా వృద్ధులు, గర్భిణీలు, దివ్యాంగులు, బాలింతలు, చిన్నారులకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని నిర్దేశించారు. రాష్ట్రవ్యాప్తంగా గుర్తించిన 4,711 మంది గర్భిణీలను సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రులు, ఆరోగ్య కేంద్రాలకు తరలించే ప్రక్రియ కొనసాగుతోందని అధికారులు సీఎంకు వివరించారు. ప్రభావిత జిల్లాల్లో వైద్య బృందాలను, అంబులెన్సులను సిద్ధంగా ఉంచాలని సూచించారు. సహాయక చర్యల కోసం రాష్ట్రంలో 7 ఎన్డీఆర్ఎఫ్, 8 ఎస్డీఆర్ఎఫ్ బృందాలను 11 జిల్లాల్లో మోహరించాలని, అదనపు బలగాలను ఎన్టీఆర్, విశాఖపట్నం జిల్లాల్లో రిజర్వ్‌లో ఉంచాలని ఆదేశించారు. మెరైన్ పోలీసులు, నౌకాదళం, కోస్ట్‌గార్డ్ సేవలను కూడా వినియోగించుకోవాలని దిశానిర్దేశం చేశారు.

**వ్యవసాయం, మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి**

తుపాను వల్ల పంట నష్టం జరగకుండా చూడాలని, ఇప్పటికే కోత కోసిన ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించేలా రైతులకు సహకరించాలని వ్యవసాయ శాఖకు సీఎం సూచించారు. రాష్ట్రంలో సుమారు 1.82 లక్షల హెక్టార్లలో ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగితే తక్షణమే పునరుద్ధరించేందుకు సిబ్బందిని, సామగ్రిని సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు నిత్యావసరాలు, రేషన్ సరకులు అందుబాటులో ఉంచాలన్నారు. తుపాను గమనాన్ని బట్టి ప్రతి నాలుగు గంటలకూ ప్రజలకు హెచ్చరికలతో కూడిన బులెటిన్ జారీ చేయాలని సీఎం ఆదేశించారు. గత తుపానుల అనుభవాలను దృష్టిలో ఉంచుకుని మరింత పకడ్బందీగా వ్యవహరించాలన్నారు. సామాజిక మాధ్యమాల్లో వదంతులు వ్యాప్తి చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు సూచించారు. తుపాను తీవ్రతను బట్టి ప్రభావిత ప్రాంతాల్లోని విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించే అధికారాన్ని కలెక్టర్లకు అప్పగించారు. ఈ సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, మంత్రి నిమ్మల రామానాయుడు, ఆర్టీజీఎస్, విపత్తు నిర్వహణ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ దూరదృష్టి ప్రశంసనీయం:

మొదటి పేజీ తరువాయి

భవిష్యత్తులో డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ నుంచి నోబెల్ బహుమతి గ్రహీతలు రావాలని భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ఆశాభావం వ్యక్తం చేశారు. వర్సిటీ 40వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా విద్యా, వైద్య, సంక్షేమ, సాంస్కృతిక రంగాలతో పాటు తెలుగు భాషాభివృద్ధికి దివంగత ఎన్టీ రామారావు అందించిన సేవలను ఆయన కొనియాడారు. దేశంలోనే తొలి హెల్త్ యూనివర్సిటీని స్థాపించడంలో ఎన్టీఆర్ చూపిన దూరదృష్టి ప్రశంసనీయమని అన్నారు. తెలుగు గంగ ప్రాజెక్టు ద్వారా చెన్నైకి తాగునీరు అందించిన ఆయన మానవతా దృక్పథాన్ని గుర్తుచేశారు. ప్రధానమంత్రి మోదీ నాయకత్వంలో వికసిత భారత్ 2047 లక్ష్యానికి అనుగుణంగా గత 12 ఏళ్లలో దేశవ్యాప్తంగా మెడికల్ కాలేజీలు, సీట్ల సంఖ్య గణనీయంగా పెరిగిందని రాధాకృష్ణన్ తెలిపారు. క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులకు కొత్త పరిష్కారాలు కనుగొనేందుకు వర్సిటీ విద్యార్థులు అంతర్జాతీయ పరిశోధనల్లో రాణించాలని సూచించారు. వైద్య రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డిజిటల్ టెక్నాలజీల ప్రాధాన్యం పెరుగుతున్నప్పటికీ, వైద్యులు మానవత్వాన్ని ఎన్నడూ మరువరాదని ఆయన హితవు పలికారు. రోగుల పట్ల కరుణ, మానవత్వం, ఆత్మీయత చూపడమే వైద్య వృత్తిలో అత్యంత ముఖ్యమని స్పష్టం చేశారు. సమాజంలో మాదకద్రవ్యాల దుర్వినియోగాన్ని అరికట్టేందుకు, దాని దుష్ప్రభావాలపై విస్తృత అవగాహన కల్పించేందుకు వైద్యులు, యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

# రేపు, ఎల్లుండి సొంత నియోజకవర్గంలో జగన్ పర్యటన

మొదటి పేజీ తరువాయి

వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ తన సొంత నియోజకవర్గమైన పులివెందులలో రెండు రోజుల పాటు పర్యటించనున్నారు. ఈ నెల 27, 28 తేదీల్లో (మంగళ, బుధవారాల్లో) ఆయన పర్యటన ఖరారైంది. ఈ సందర్భంగా రేపు, ఎల్లుండి ఆయన స్థానిక ప్రజలకు అందుబాటులో ఉండనున్నారు. పర్యటన షెడ్యూల్ ప్రకారం, జగన్ మంగళవారం (27వ తేదీ) ఉదయం 10:30 గంటలకు తాడేపల్లి నుంచి బయలుదేరి పులివెందులకు చేరుకుంటారు. అనంతరం భాకరాపురంలోని తన క్యాంపు కార్యాలయానికి వెళ్లి, అక్కడ ప్రజలను కలుసుకుంటారు. వారి సమస్యలు, వినతులను స్వీకరించేందుకు అందుబాటులో ఉంటారు. ఆ రోజు రాత్రికి పులివెందులలోని తన నివాసంలోనే బస చేస్తారు. రెండు రోజుల పర్యటన ముగించుకుని బుధవారం (28వ తేదీ) ఉదయం ఆయన పులివెందుల నుంచి తిరిగి తాడేపల్లిలోని తన నివాసానికి బయలుదేరి వెళ్లనున్నారు.

# ఇలాగైతే ప్రజల మద్దతు పొందలేరు.. ఆ పార్టీ దుకాణం సర్దేసుకోవడం మంచిది

మొదటి పేజీ తరువాయి

పుంగనూరు, తిరుపతి, రాయచోటి, పులివెందుల, కడప, దర్శి, కనిగిరి వంటి ప్రాంతాల్లో వైసీపీ శ్రేణులు చేసిన దాడులే ఇందుకు నిదర్శనమని అనగాని పేర్కొన్నారు. ఎన్నికలు ఏవైనా హింసను ప్రోత్సహించడమే జగన్ నైజమని, గత ఐదేళ్ల పాలనను చూసి ప్రజలు 11 సీట్లకే పరిమితం చేసినా ఆయన తీరులో ఎలాంటి మార్పు రాలేదని అన్నారు. కుట్రలు, దాడులు, విధ్వంసాలతో ప్రజల ఓట్లు సాధించలేరనే వాస్తవాన్ని జగన్ గుర్తించాలని హితవు పలికారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రజల నుంచి విశేష మద్దతు లభిస్తోందని మంత్రి తెలిపారు. అందుకే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఛాంపియన్ కూటమి విజయ దుందుభి మోగిస్తోందని ధీమా వ్యక్తం చేశారు. "స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు చూసైనా గొడ్డలి పార్టీ నాయకులకు, జగన్ రెడ్డికి బుద్ధి రావాలి. ఇక ఆ పార్టీ దుకాణం సర్దేసుకోవడం మంచిది" అని అనగాని సత్యప్రసాద్ తన ప్రకటనలో వ్యాఖ్యానించారు.




# తీవ్ర తుపానుగా బలపడిన 'అర్ణబ్'.. ఏపీ తీరం వైపు వేగంగా కదలిక!

మొదటి పేజీ తరువాయి

బంగాళాఖాతంలో ఏర్పడిన 'అర్ణబ్' తుపాను మరింత బలపడి తీవ్ర తుపానుగా మారింది. ఇది వేగంగా ఆంధ్రప్రదేశ్ తీరం వైపు కదులుతోందని, దీని ప్రభావం రాష్ట్రంపై గణనీయంగా ఉండనుందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. ఈ తుపాను రానున్న 12 గంటల్లో అతి తీవ్ర తుపానుగా మారే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు. ప్రస్తుతం తూర్పుమధ్య, పశ్చిమమధ్య బంగాళాఖాతంలో కేంద్రీకృతమై ఉన్న ఈ తుపాను, గడిచిన 6 గంటల్లో గంటకు 17 కిలోమీటర్ల వేగంతో పశ్చిమ దిశగా పయనిస్తోంది. ఇది విశాఖపట్నం, ఒడిశాలోని గోపాల్‌పూర్‌కు చెరో 490 కిలోమీటర్ల దూరంలో, కాకినాడకు 560 కి.మీ, మచిలీపట్నంకు 660 కి.మీ, బాపట్లకు 730 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉందని ప్రఖర్ జైన్ వివరించారు. రేపు సాయంత్రం వరకు పశ్చిమ వాయువ్య దిశగా ప్రయాణించి, ఆ తర్వాత వాయువ్య దిశగా మలుపు తీసుకుంటుందని అంచనా వేశారు.

**బాపట్ల–విశాఖ మధ్య తీరం దాటే అవకాశం**

ఎల్లుండి (బుధవారం) ఉదయం బాపట్ల–విశాఖపట్నం మధ్య, యానాం సమీపంలో ఈ తుపాను తీరాన్ని దాటే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. తీరం దాటే సమయంలో గాలి వేగం గంటకు 115-125 కిలోమీటర్ల వరకు ఉండవచ్చని, గరిష్ఠంగా 140 కిలోమీటర్ల వేగానికి చేరే సూచనలు ఉన్నాయని హెచ్చరించారు. దీని ప్రభావంతో రాష్ట్రంలో రేపు, ఎల్లుండి విస్తారంగా వర్షాలు, పలుచోట్ల అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని తెలిపారు.




**ప్రజలు అప్రమత్తంగా ఉండాలి**

తుపాను నేపథ్యంలో రేపు కోస్తా తీరం వెంబడి గంటకు 90–100 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీస్తాయని అధికారులు హెచ్చరించారు. ప్రజలు చెట్లు, భారీ హోర్డింగులు, శిథిలావస్థలో ఉన్న భవనాల వద్ద ఉండరాదని సూచించారు. అత్యవసర సహాయం కోసం విపత్తుల నిర్వహణ సంస్థ 112, 1070, 1800 425 0101 టోల్ ఫ్రీ నంబర్లను ఏర్పాటు చేసింది. ప్రజలు ఈ నంబర్లను సంప్రదించి సహాయం పొందవచ్చని, అప్రమత్తంగా ఉండాలని కోరారు.

# 'అర్ణబ్' తుపానుపై వదంతులు నమ్మొద్దు..

మొదటి పేజీ తరువాయి

బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం నేడు తుపానుగా మారింది. ఈ తుపానుకు 'అర్ణబ్' అని నామకరణం చేశారు. 'అర్ణబ్' తుపాను ఏపీ దిశగా వస్తోందని వాతావరణ నివేదికలు చెబుతున్నాయి. ఈ క్రమంలో, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పందించారు. అనవసరమైన వదంతులను నమ్మవద్దని, కేవలం అధికారిక సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. భారత వాతావరణ శాఖ (×వీణ), విపత్తు నిర్వహణ శాఖ, జిల్లా యంత్రాంగం ఇచ్చే సూచనలను మాత్రమే పాటించాలని సోమవారం స్పష్టం చేశారు. ఈ విపత్కర సమయంలో ప్రజలందరూ సమన్వయంతో, ముందస్తు అప్రమత్తతతో వ్యవహరించి తుపాను గండం నుంచి సురక్షితంగా బయటపడాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ మేరకు మంత్రి సోషల్ మీడియా ద్వారా ప్రజలకు సూచనలు జారీ చేశారు.

**తీరం దాటేది అప్పుడే.. రెడ్ అలర్ట్ జారీ**

బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం 'అర్ణబ్' తుపానుగా మారి వేగంగా బలపడుతోందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఇది అక్టోబర్ 26, సోమవారం అర్ధరాత్రికి తీవ్ర తుపానుగా, మరుసటి రోజు అక్టోబర్ 27న అతి తీవ్ర తుపానుగా మారనుందని తెలిపారు. అక్టోబర్ 28, బుధవారం ఉదయం బాపట్ల-విశాఖపట్నం మధ్య తీరం దాటే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. తీరం దాటే సమయంలో గంటకు 115 నుంచి 125 కిలోమీటర్లు,



గరిష్ఠంగా 140 కిలోమీటర్ల వేగంతో ప్రచండ గాలులు వీచే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరించారు. ఈ నేపథ్యంలో అక్టోబర్ 27, 28 తేదీల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని, ఈ కారణంగా ఆంధ్రప్రదేశ్, దక్షిణ ఒడిశా తీరప్రాంతాలకు రెడ్ అలర్ట్ జారీ చేసినట్లు మంత్రి వెల్లడించారు.

**ప్రాణరక్షణకే తొలి ప్రాధాన్యం...** ఈ విపత్తు సమయంలో ప్రజల ప్రాణరక్షణకే తమ ప్రభుత్వం తొలి ప్రాధాన్యం ఇస్తుందని అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. తీర, లోతట్టు ప్రాంతాల ప్రజలు తక్షణమే అధికారులు సూచించిన సురక్షిత ప్రాంతాలకు, పునరావాస కేంద్రాలకు తరలివెళ్లాలని కోరారు. ప్రతి ఒక్కరూ అత్యవసర మందులు, తాగునీరు, ఆహార పొట్లాలు, టార్చ్‌లైట్లు, బ్యాటరీలు, ముఖ్యమైన పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. బలహీనమైన భవనాలు, చెట్లు, విద్యుత్ స్తంభాలు, హోర్డింగులకు దూరంగా ఉండాలని, వర్షాలు, పిడుగుల సమయంలో బయటకు రావద్దని హెచ్చరించారు. మత్స్యకారులు ఎవరూ సముద్రంలోకి వేటకు వెళ్లవద్దని, ఇప్పటికే వెళ్లినవారు వెంటనే తీరానికి చేరుకోవాలని ఆదేశించారు.

**రైతన్నలకు ప్రత్యేక సూచనలు...** రైతులు తమ పంటలను కాపాడుకునేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అచ్చెన్నాయుడు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. కోతకు సిద్ధంగా ఉన్న వరి, పత్తి, మొక్కజొన్న, వేరుశనగ వంటి పంటలను వాతావరణం అనుకూలించగానే కోసి, సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. ధాన్యం రాశులు, ఇతర ఉత్పత్తులను టార్పాలిన్లతో కప్పి భద్రపరచుకోవాలన్నారు. అరటి, బొప్పాయి వంటి ఉద్యాన పంటలకు ఊతంగా కర్రలు ఏర్పాటు చేసుకోవాలని, పొలాల్లో నీరు నిలిచిపోకుండా మురుగు కాలువలను సిద్ధం చేసుకోవాలని తెలిపారు. విత్తనాలు, ఎరువులు, యంత్ర పరికరాలను ఎత్తైన, సురక్షిత ప్రదేశాల్లో ఉంచాలన్నారు. అయితే, పంటలను కాపాడే ప్రయత్నంలో రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ తమ ప్రాణాలను పణంగా పెట్టవద్దని ఆయన గట్టిగా కోరారు. వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక, మత్స్యశాఖ అధికారుల సలహాలను పాటిస్తూ ఈ విపత్తును ధైర్యంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు.

# ప్రజా సమస్యల పరిష్కారం కోసం సిపిఎం కృషి చేస్తుంది

భట్టిప్రోలు రక్షణ న్యూస్

సిపిఎం పార్టీ జెడ్పిటిసి అభ్యర్థి గొర్రుముచ్చు సుధాకర్ ప్రచారం జిలుగువారిపాలెం, గుత్తవారిపాలెం పెదపులివర్రు గ్రామాలలో నిర్వహించడం జరిగింది ఇంటింటికి తిరిగి ఓటర్లను కలిసి ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి పి. మనోజ్ కుమార్, జడ్పిటిసి అభ్యర్థి జి.సుధాకర్ మాట్లాడుతూ సొసైటీలు ఏర్పాటు చేసి లంక భూములను దళితులకు ఇవ్వడంలో సిపిఎం పార్టీ ఆనాడు కృషి చేసిందని 2009 వరదల సమయంలో ఓలేర వద్ద కట్ట తెగి ముంపుకు గురైన గ్రామాలకు నష్టపరిహారాన్ని పోరాడి ఇప్పించాము, సొసైటీ భూముల రైతులకు ఎరువులు యూరియా ఇవ్వాలని అధికారులతో మాట్లాడి రైతులకు వినిపించడంలో కృషి చేసాము ఈ ప్రాంతంలో రైతు సంఘ సమస్యలపై ఉపాధి హామీ పనులు కల్పించాలని నిరంతరం సిపిఎం పార్టీ పనిచేస్తుందని గ్రామంలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించేందుకు కార్మికులు వ్యవసాయ కూలీలు రైతులు పేద ప్రజల సమస్యలపై



అవగాహన ఉన్న గొర్రుముచ్చు సుధాకర్ కు మీ అమూల్యమైన ఓటు వేసి జిల్లా పరిషత్ కు పంపించాలని కోరారు ప్రచార కార్యక్రమంలో సిపిఎం జిల్లా మండల నాయకులు బొనిగల అగస్టిన్, అంతగాని నాగమల్లేశ్వరరావు, గోళ్ళ నాగరాజు, మురుగుడు సత్యనారాయణ, నాగేశ్వరావు గ్రామస్తులు పాల్గొన్నారు.

# పిల్లుల్లో క్యాన్సర్ అధ్యయనం ద్వారా మనుషుల్లో చికిత్స.. ముఖ్యమైన అంశాలు వెలుగులోకి..

పిల్లుల్లో వచ్చే క్యాన్సర్‌కు సంబంధించిన జన్యుపరమైన మార్పులపై శాస్త్రవేత్తలు ఇప్పటివరకు పెద్దగా తెలియని అంశాలను వెలుగులోకి తీసుకొచ్చారు. అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన ఈ అధ్యయనంలో దాదాపు 500 పెంపుడు పిల్లుల్లోని క్యాన్సర్ కణితుల నమూనాలను పరిశీలించారు. ఐదు దేశాలకు చెందిన పిల్లుల నుంచి సేకరించిన కణితి నమూనాల్లో క్యాన్సర్ ఏర్పడడానికి, పెరగడానికి కారణమయ్యే జన్యు మార్పులను శాస్త్రవేత్తలు విశ్లేషించారు. ఈ పరిశోధన ద్వారా పిల్లుల్లో క్యాన్సర్‌ను మరింత కచ్చితంగా గుర్తించి చికిత్స అందించేందుకు మార్గం సుగమం కావడంతో పాటు, మనుషుల్లో క్యాన్సర్ ఎలా అభివృద్ధి చెందుతుంది, మందులకు ఎలా స్పందిస్తుంది అనే అంశాలపై కూడా కొత్త అవగాహన లభించే అవకాశం ఉందని పరిశోధకులు చెబుతున్నారు. పిల్లుల్లో క్యాన్సర్ అనారోగ్యం, మరణానికి ప్రధాన కారణాల్లో ఒకటైనా, మనుషులు లేదా కుక్కల్లో వచ్చే క్యాన్సర్‌తో పోలిస్తే పిల్లుల కణితుల్లోని జన్యు మార్పులపై ఇప్పటివరకు పరిమిత సమాచారం మాత్రమే ఉంది.

**క్యాన్సర్‌ను ప్రేరేపించే డ్రైవర్ జీన్స్..**

కణాల పెరుగుదల, విభజన, దెబ్బతిన్న కణాల మరమ్మత్తు, కణాల మరణాన్ని నియంత్రించే కొన్ని జన్యువుల్లో మార్పులు చోటుచేసుకున్నప్పుడు క్యాన్సర్ అభివృద్ధి చెందే అవకాశం ఉంటుంది. ఇలాంటి క్యాన్సర్‌ను ప్రేరేపించే జన్యువులను క్యాన్సర్ డ్రైవర్ జీన్స్ గా పిలుస్తారు. పిల్లుల్లో గుర్తించిన అనేక డ్రైవర్ జన్యువులు మనుషులు, కుక్కల్లో కనిపించే క్యాన్సర్లలోనూ ఉన్నట్లు పరిశోధకులు గుర్తించారు. ముఖ్యంగా రొమ్ము కణజాలంలో ఏర్పడే దూకుడు స్వభావం కలిగిన కణితుల్లో ఎఫ్‌బీఎక్స్‌డబ్ల్యూ7 జన్యు మార్పు ఎక్కువగా కనిపించింది. పరిశీలించిన పిల్లుల రొమ్ము కణితుల్లో 50 శాతానికి పైగా ఈ జన్యువులో మార్పు ఉన్నట్లు గుర్తించారు. సాధారణంగా కణాల పెరుగుదల, విభజనకు సంబంధించిన ప్రోటీన్లను నియంత్రించడంలో ఈ జన్యువు సహాయపడుతుంది. ఇందులో మార్పులు వచ్చినప్పుడు కొన్ని వృద్ధిని ప్రోత్సహించే ప్రోటీన్లు పేరుకుపోయి క్యాన్సర్ కణాలు జీవించి, వ్యాప్తి చెందేందుకు సహాయపడే అవకాశం ఉంటుంది. మనుషుల్లోనూ రొమ్ము క్యాన్సర్‌లో ఈ జన్యు మార్పులు అధ్వాన్నమైన ఫలితాలతో సంబంధం కలిగి ఉన్నట్లు అధ్యయనం పేర్కొంది.

**పిల్లులపై సైతం ప్రభావం..**

పిల్లులు మనుషులతో ఒకే వాతావరణంలో జీవించడం



వల్ల ఈ పరిశోధనకు మరో ప్రత్యేక ప్రాధాన్యం ఉందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఇంట్లో ఉపయోగించే కొన్ని రసాయనాలు, వాయు కాలుష్యం, పొగ వంటి పర్యావరణ ప్రభావాలకు పిల్లులు కూడా గురవుతాయి. అందువల్ల సహజంగా పిల్లుల్లో ఏర్పడే క్యాన్సర్‌ను అధ్యయనం చేయడం ద్వారా జన్యువులు, పర్యావరణం కలిసి క్యాన్సర్ ప్రమాదాన్ని ఎలా ప్రభావితం చేస్తాయో అర్థం చేసుకునే అవకాశం ఉంటుంది. అంతేకాకుండా ఎఫ్‌బీఎక్స్‌డబ్ల్యూ7 జన్యువులో మార్పు ఉన్న పిల్లుల రొమ్ము కణితుల కణజాల నమూనాల్లో కొన్ని కీమోథెరపీ మందులు మెరుగ్గా పనిచేసినట్లు పరిశోధకులు గుర్తించారు. అయితే ఈ ఫలితం కేవలం కణజాల నమూనాలపై మాత్రమే కనిపించింది. జీవించి ఉన్న పిల్లులు లేదా మనుషుల్లో ఇదే విధంగా పనిచేస్తుందని నిర్ధారించడానికి మరిన్ని పరిశోధనలు అవసరం. అయినప్పటికీ, కణితిలోని జన్యు లక్షణాల ఆధారంగా సరైన చికిత్సను ఎంచుకునే ప్రెసిషన్ ఆంకాలజీ విధానానికి ఇది ఉపయోగపడే అవకాశం ఉంది.

**మనుషుల్లో క్యాన్సర్ పరిశోధనలకు దోహదం..**

ఈ పరిశోధన మనుషులు, జంతువుల వైద్య రంగాల మధ్య పరస్పర సహకారానికి కూడా ఉపయోగపడుతుందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. పిల్లుల్లో సహజంగా ఏర్పడే క్యాన్సర్లను అధ్యయనం చేయడం ద్వారా లభించే సమాచారం భవిష్యత్తులో మనుషుల్లో క్యాన్సర్ పరిశోధనకు ఉపయోగపడుతుంది. అదే విధంగా మనుషుల్లో అభివృద్ధి చేసిన కొన్ని క్యాన్సర్ చికిత్సలను సహజంగా కణితులు ఏర్పడిన జంతువుల్లో పరిశీలించే అవకాశం కూడా ఉంటుంది. ఈ విధానాన్ని వన్ మెడిసిన్ గా పేర్కొంటారు. పరిశోధకులు రూపొందించిన పిల్లుల క్యాన్సర్‌కు సంబంధించిన జన్యు సమాచార వనరు ఇతర శాస్త్రవేత్తలకు కూడా అందుబాటులో ఉండనుంది. దీని ద్వారా భవిష్యత్తులో పిల్లుల్లో క్యాన్సర్‌ను మరింత ముందుగానే గుర్తించడం, కణితి లక్షణాలకు అనుగుణంగా చికిత్సను ఎంచుకోవడం వంటి వ్యక్తిగతీకరించిన వైద్య విధానాలు అభివృద్ధి చెందే అవకాశం ఉందని పరిశోధకులు ఆశిస్తున్నారు.

# పురపోరులో కూటమి ప్రభంజనం.. 17 మున్సిపాలిటీలు ఏకగ్రీవం

మొదటి పేజీ తరువాయి



ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న పురపాలక ఎన్నికల్లో అధికార టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి విజయఢంకా మోగిస్తోంది. పోలింగ్‌కు ముందే రాష్ట్రంలోని 17 మున్సిపాలిటీలు, నగర పంచాయతీలను కూటమి ఏకగ్రీవంగా కైవసం చేసుకుంది. ఈ 17 ఛైర్‌పర్సన్ స్థానాల్లో తెలుగుదేశం పార్టీ 15, జనసేన 1, బీజేపీ 1 చొప్పున విజయం సాధించాయి. వార్డులు, డివిజన్ల వారీగా పరిశీలిస్తే కూటమి అభ్యర్థులు గణనీయ సంఖ్యలో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కూటమి తరపున మొత్తం 726 స్థానాలు (టీడీపీ 660, జనసేన 38, బీజేపీ 28) ఏకగ్రీవం కాగా, ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేవలం 19 స్థానాల్లోనే ఏకగ్రీవ విజయాలను నమోదు చేసింది. సీపీఐ ఒక స్థానంలో, స్వతంత్రులు 5 స్థానాల్లో విజయం సాధించారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం వార్డుల్లో 21.08 శాతం, డివిజన్లలో 12.58 శాతం స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. ఈ ఏకగ్రీవ ఫలితాల్లో ప్రతిపక్ష నేత వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి సొంత జిల్లాలో కూటమి సాధించిన విజయాలు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. కడప జిల్లాలో 8 పురపాలక సంఘాలకు ఎన్నికలు జరుగుతుండగా, అందులో 6 చోట్ల ఛైర్‌పర్సన్ పదవులను కూటమి ఏకగ్రీవంగా దక్కించుకుంది. కడప కార్పొరేషన్‌లో 66 డివిజన్లకు గాను 50 స్థానాలను, పులివెందుల మున్సిపాలిటీలో 40 వార్డులకు గాను 20 వార్డులను కూటమి ఏకగ్రీవంగా గెలుచుకుంది. వీటితో పాటు పుంగనూరు, నగరి, గురజాల నియోజకవర్గాల్లోని మూడు పట్టణ స్థానిక సంస్థల్లోనూ కూటమి జెండా ఎగరేసింది. రాష్ట్రవ్యాప్తంగా 87 మున్సిపాలిటీలు, 13 కార్పొరేషన్లకు ఎన్నికలు జరుగుతున్నాయి. అయితే, పలుచోట్ల స్థానిక విభేదాలు, ఇతర సాంకేతిక కారణాల వల్ల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను పోటీకి నిలబెట్టడంలో విఫలమైనట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

# చెప్పాం.. చేస్తున్నాం: 'బెల్' ప్రాజెక్ట్‌పై మంత్రి నారా లోకేశ్

మొదటి పేజీ తరువాయి



ఆంధ్రప్రదేశ్‌లోని రాయలసీమ ప్రాంత పారిశ్రామిక అభివృద్ధిలో కీలక ముందడుగు పడింది. కేంద్ర ప్రభుత్వ నవరత్న సంస్థ అయిన భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీఈఎల్), శ్రీ సత్యసాయి జిల్లాలో భారీ రక్షణ రంగ తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయనుంది. ఇందుకోసం సుమారు రూ. 2,500 కోట్ల మేర పెట్టుబడి పెట్టనుంది. ఈ ప్రాజెక్ట్ కోసం ప్రభుత్వం సుమారు 914 ఎకరాల భూమిని కేటాయించింది. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో రూపొందే ఈ ఇంటిగ్రేటెడ్ డిఫెన్స్ సిస్టమ్స్ కాంప్లెక్స్ ద్వారా స్థానిక యువతకు ప్రత్యక్షంగా 800 ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. దీనితో పాటు అనుబంధ పరిశ్రమల ఏర్పాటు ద్వారా పరోక్షంగా మరిన్ని ఉపాధి అవకాశాలు లభిస్తాయని అంచనా వేస్తున్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. రాయలసీమలో అత్యాధునిక రక్షణ రంగ తయారీ పరిశ్రమను నెలకొల్పుతున్నామని, దీనివల్ల స్థానికంగా ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని ఆయన పేర్కొన్నారు. 'చెప్పాం.. చేస్తున్నాం!' అంటూ ఈ ప్రాజెక్టు పురోగతిపై ఆయన హర్షం వ్యక్తం చేశారు.

# దృష్టి లోపం ఉన్న విద్యార్థులకు ఉచితంగా కళ్లద్దాల పంపిణీ



భట్టిప్రోలు రక్షణ న్యూస్

విద్యార్థుల కంటి చూపు సమస్యలను గుర్తించి, వారికి అవసరమైన సహాయాన్ని అందించడమే లక్ష్యంగా భట్టిప్రోలు ప్రాంతంలో సేవా కార్యక్రమం నిర్వహించారు. సేవా సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా కళ్లద్దాలను పంపిణీ చేశారు. గత సెప్టెంబరు 21న టీ.ఎం. రావు ఉన్నత పాఠశాలలో సేవా సంస్థ ఆధ్వర్యంలో బాలబాలికలకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో 20 మంది విద్యార్థులకు దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించారు. దీంతో వారికి అవసరమైన కళ్లద్దాలను ఉచితంగా అందించేందుకు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో సోమవారం పాఠశాల ప్రతినిధి పులికొండ మల్లికార్జునరావు విద్యార్థులకు కళ్లద్దాలను అందజేశారు. ఉచితంగా కళ్లద్దాలు అందించిన సేవా సంస్థకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులోనూ విద్యార్థులకు అవసరమైన సహాయ సహకారాలను అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె. కోటేశ్వరమ్మ, సేవా సంస్థ కార్యవర్గ సభ్యులు బోలిశెట్టి శ్రీనివాసరావు, పసుపులేటి శివరామప్రసాద్, ఉపాధ్యాయులు చి. ఉమామహేశ్వరరావు, కె. లక్ష్మీపార్వతి, చి. శ్రీనివాసరావు, ఎ. పవన్ తదితరులు పాల్గొన్నారు.

# హ్యాట్రిక్ విజయంపై భారత్ కన్ను!

**సిరీస్ ఆశలు నిలవాలంటే కివీస్ గెలవాల్సిందే..**
**సిరీస్ లో 0-2తో వెనుకబడిన కివీస్**
**హెన్రీ, ఫెర్గూసన్ దూరం.. ఆతిథ్య జట్టుకు ఎదురుదెబ్బ**
**హ్యాట్రిక్ విజయంపై టీమ్ఇండియా గురి**
**వెల్లింగ్టన్ గాలులు, చిన్న బౌండరీలతో కొత్త సవాలు**
**రెండో టీ20లో నాలుగు వికెట్లు తీసిన శాంట్నర్‌తో ప్రమాదం**



న్యూజిలాండ్‌తో మూడో టీ20కి రంగం సిద్ధమైంది. వరుసగా రెండు విజయాలతో జోరుమీదున్న టీమిండియా మరో గెలుపుతో సిరీస్‌ను కైవసం చేసుకోవాలని చూస్తోంది. మరోవైపు సొంతగడ్డపై ఇప్పటికే రెండు మ్యాచ్‌ల్లో ఓడిన న్యూజిలాండ్‌కు ఇది చావోరేవో పోరు. ఈ మ్యాచ్‌లోనూ ఓడితే సిరీస్ చేజారిపోతుంది. కీలకమైన ఈ పోరుకు ముందు కివీస్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. ఆ జట్టు ప్రధాన పేసర్లు మాట్ హెన్రీ, లాకీ ఫెర్గూసన్ మూడో టీ20కి దూరమయ్యారు. దీంతో ఒత్తిడిలో ఉన్న ఆతిథ్య జట్టుకు సవాలు మరింత పెరిగింది. క్రైస్ట్‌చర్చ్‌లో జరిగిన రెండో టీ20లో మాట్ హెన్రీ కేవలం రెండు ఓవర్లే బౌలింగ్ చేశాడు. అందులో ఒకటి మెయిడిన్. కాలి కండరాల సమస్యతో ఇబ్బందిపడిన అతడిని మిగిలిన సిరీస్ నుంచి తప్పించారు. ఇతర ఫార్మాట్లకు సిద్ధమయ్యేందుకు అతడి పనిభారాన్ని తగ్గించాలని జట్టు నిర్ణయించింది. లాకీ ఫెర్గూసన్ కూడా రెండో మ్యాచ్‌లో పూర్తి కోటా ఓవర్లు వేయకుండానే మైదానం వీడాడు. ముందు జాగ్రత్త చర్యగా అతడికి మూడో మ్యాచ్‌లో విశ్రాంతి ఇవ్వనున్నారు. ఈ ఇద్దరు లేకపోవడంతో ఆడమ్ మిల్నే, బ్లెయిర్ టిక్నర్‌లపై కివీస్ ఆధారపడాల్సి ఉంటుంది. కైల్ జేమీసన్ కూడా వెల్లింగ్టన్ మ్యాచ్ ఆడిన తర్వాత టెస్టు సిరీస్‌కు సన్నద్ధమయ్యేందుకు ఫోర్డ్ ట్రోఫీలో పాల్గొననున్నాడు.

## గెలుపు జోరులో భారత్.. భువీపై ప్రత్యేక దృష్టి

మరోవైపు టీమిండియా ఇప్పటివరకు అన్ని విభాగాల్లోనూ మెరుగైన ప్రదర్శన చేసింది. తొలి మ్యాచ్‌కు ముందు ఒక్కసారి మాత్రమే ప్రాక్టీస్ చేసినప్పటికీ, బ్యాటింగ్‌లో సత్తా చాటింది. తొలి టీ20లో 226 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించిన భారత్.. రెండో మ్యాచ్‌లో 181 పరుగుల లక్ష్యాన్నీ అందుకుంది. అయితే న్యూజిలాండ్ ఫీల్డింగ్, బౌలింగ్‌లో చేసిన తప్పిదాలు కూడా భారత్ విజయాలకు కారణమయ్యాయి. భారత సీనియర్ పేసర్ భువనేశ్వర్ కుమార్ మాత్రం తన స్థాయికి తగ్గ ప్రదర్శన చేయాల్సి ఉంది. ఈ సిరీస్‌లో ఇప్పటివరకు ఎనిమిది ఓవర్లు వేసి 99 పరుగులు ఇచ్చిన అతడు ఒక్క వికెట్ మాత్రమే తీశాడు. వెల్లింగ్టన్‌లోనైనా పుంజుకుంటాడని భారత జట్టు ఆశిస్తోంది.

## గాలులు.. చిన్న బౌండరీలు కీలకం!

వెల్లింగ్టన్‌లోని హెచ్ఎన్ఆర్‌వై స్టేడియం పరిస్థితులు భారత్‌కు కొత్త సవాలు విసరనున్నాయి. 'కేక్ టిన్'గా పేరున్న ఈ మైదానంలో సాధారణంగా బలమైన గాలులు వీస్తుంటాయి. ఇక్కడి పిచ్ కూడా డ్రాప్-ఇన్ పిచ్. మైదానానికి ఇరువైపులా స్క్వేర్ బౌండరీలు సుమారు 60 మీటర్లే ఉండటంతో బ్యాటర్లు భారీ షాట్లతో విరుచుకుపడే అవకాశం ఉంది. ఈ పరిస్థితులకు తగ్గట్టుగా భారత బౌలర్లు తమ వ్యూహాలను మార్చుకోవాల్సి ఉంటుంది.

ఇక గాయం నుంచి పూర్తిగా కోలుకోని ఇషాన్ కిషన్ మూడో మ్యాచ్‌కూ అందుబాటులో ఉండడం లేదు. కుడి తొడ కండరానికి స్వల్ప గాయం కావడంతో అతడు ఇంకా కోలుకుంటున్నాడు. దీంతో యువ సంచలనం వైభవ్ సూర్యవంశీకి మరోసారి మూడో స్థానంలో బ్యాటింగ్ చేసే అవకాశం దక్కనుంది. గత మ్యాచ్‌లో ఆడిన జట్టుతోనే భారత్ బరిలోకి దిగే సూచనలు కనిపిస్తున్నాయి.

## గణాంకాల్లోనూ భారత్‌దే పైచేయి

న్యూజిలాండ్‌తో టీ20ల్లో భారత్ రికార్డు మెరుగ్గా ఉంది. ఇరు జట్ల మధ్య జరిగిన 33 టీ20ల్లో భారత్ 21 గెలవగా, న్యూజిలాండ్ 11 మ్యాచ్‌ల్లో విజయం సాధించింది. ఒక మ్యాచ్ టైగా ముగిసింది. న్యూజిలాండ్ గడ్డపై ఆడిన 14 టీ20ల్లోనూ భారత్ తొమ్మిది విజయాలు సాధించింది. భారత బ్యాటర్ తిలక్ వర్మ ఛేజింగ్‌లో కీలక ఆటగాడిగా ఎదిగాడు. టీ20ల్లో లక్ష్య ఛేదన సమయంలో అతడి సగటు 51.6 కాగా, తొలుత బ్యాటింగ్ చేసినప్పుడు 39.7గా ఉంది. తిలక్ నాటౌట్‌గా నిలిచిన 12 టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌ల్లోనూ భారత్ గెలిచింది. మొత్తం టీ20 క్రికెట్‌లో అతడు నాటౌట్‌గా ముగించిన 26 ఇన్నింగ్స్‌ల్లోనూ అతడి జట్టే విజయం సాధించడం విశేషం. 2025 నుంచి ఇప్పటివరకు 52 టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో 1,282 పరుగులు చేసిన తిలక్.. 41.4 సగటు, 141.7 స్ట్రైక్‌రేట్‌తో రాణించాడు. అయితే భారత బ్యాటర్లకు కివీస్ కెప్టెన్ మిచెల్ శాంట్నర్ నుంచి ముప్పు పొంచి ఉంది. రెండో టీ20లో అతడు నాలుగు వికెట్లు పడగొట్టాడు. 2025లో స్పిన్ బౌలింగ్‌లో భారత బ్యాటర్లు సగటున 58.2 పరుగులు చేయగా, 2026లో ఆ సగటు 27.3కు పడిపోయింది. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది స్పిన్నర్ల బౌలింగ్‌లో భారత్ వికెట్లు వేగంగా కోల్పోతోంది. ఈ బలహీనతను శాంట్నర్ మరోసారి ఉపయోగించుకోవాలని చూస్తున్నాడు. మొత్తానికి, భారత్ హ్యాట్రిక్ విజయంతో సిరీస్‌ను సొంతం చేసుకుంటుందా? లేక కివీస్ పుంజుకుని పోరును ఆసక్తికరంగా మారుస్తుందా? అనేది చూడాలి.

## మ్యాచ్ వివరాలు

తేదీ: అక్టోబర్ 27, మంగళవారం
సమయం: మధ్యాహ్నం 12.30 గంటలకు
వేదిక: హెచ్ఎన్ఆర్‌వై స్టేడియం, వెల్లింగ్టన్
ప్రత్యక్ష ప్రసారం: సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్
లైవ్ స్ట్రీమింగ్: సోనీ లివ్ యాప్, వెబ్‌సైట్

# ఒక్క పరుగు తేడాతో డబుల్ సెంచరీ మిస్

## న్యూజిలాండ్-ఎ పై పడిక్కల్ దండయాత్ర



న్యూజిలాండ్-ఎ జట్టుతో జరుగుతున్న తొలి అనధికారిక టెస్టు మ్యాచ్‌లో భారత్-ఎ జట్టు అద్భుత పునరాగమనం (కంబ్యాక్) సాధించింది. భారత యువ బ్యాటర్ దేవదత్ పడిక్కల్ (199) విధ్వంసకర ఇన్నింగ్స్‌తో చెలరేగడంతో మ్యాచ్‌పై ఇండియా-ఎ పూర్తి ఆధిపత్యం సాధించింది. బెర్ట్ సట్‌క్లిఫ్ ఓవల్ మైదానంలో జరుగుతున్న ఈ మ్యాచ్ మూడో రోజు పోరులో పడిక్కల్ సుడిగాలి సెంచరీతో జట్టును సురక్షిత తీరానికి చేర్చాడు. పడిక్కల్ 248 బంతుల్లో 24 ఫోర్లు, 3 సిక్సర్ల సాయంతో 80.24 స్ట్రైక్ రేట్‌తో 199 పరుగులు సాధించాడు. అయితే టీ విరామానికి 10 నిమిషాల ముందు జాక్ గిబ్సన్ బౌలింగ్‌లో అంపైర్ ఇచ్చిన క్యాచ్ ఔట్ నిర్ణయంతో పడిక్కల్ తీవ్ర అసంతృప్తికి లోనయ్యాడు. బంతి బ్యాట్‌కు అసలు తగలలేదని సైగలు చేస్తూ, మైదానంలోనే అంపైర్ నిర్ణయాన్ని సవాలు చేస్తూ నిరాశగా వెనుతిరిగాడు. కేవలం ఒక్క పరుగు తేడాతో ద్విశతకం (డబుల్ సెంచరీ) చేజార్చుకున్నప్పటికీ, అతడు ఆడిన ఇన్నింగ్స్ మ్యాచ్ స్వరూపాన్నే మార్చేసింది.

## ఘోర పతనం నుంచి అద్భుత కంబ్యాక్!

ఈ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో ఇండియా-ఎ కేవలం 113 పరుగులకే కుప్పకూలగా, న్యూజిలాండ్ 'ఎ' 317 పరుగులు చేసి 204 పరుగుల భారీ ఆధిపత్యాన్ని సాధించింది. రెండో ఇన్నింగ్స్ ప్రారంభంలోనూ ఓపెనర్లు యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్‌లు 9 పరుగులకే పెవిలియన్ చేరడంతో భారత్ తీవ్ర కష్టాల్లో పడింది. ఈ దశలో క్రీజులోకి వచ్చిన పడిక్కల్, సాయి సుదర్శన్ (91)తో కలిసి మూడో వికెట్‌కు ఏకంగా 215 పరుగుల రికార్డు భాగస్వామ్యం నెలకొల్పాడు. ఆ తర్వాత యష్ రాథోడ్‌తో కలిసి మరో 142 పరుగుల విలువైన భాగస్వామ్యాన్ని జోడించాడు. మూడో రోజు ఆట ముగిసే సమయానికి ఇండియా-ఎ 6 వికెట్ల నష్టానికి 378 పరుగులు చేసి, 174 పరుగుల ఆధిక్యంలో నిలిచింది.

## రేసులో పడిక్కల్.. టెస్టు బెర్త్ కోసం గట్టి పోటీ!

టెస్ట్ క్రికెట్‌లో పడిక్కల్ అద్భుతమైన ఫామ్‌ను కొనసాగిస్తున్నాడు. శ్రీలంక పర్యటనలో స్పిన్నర్లపై ధాటిగా ఆడిన అతడు, ఇప్పుడు న్యూజిలాండ్ వేగవంతమైన పిచ్‌లపై కూడా సత్తా చాటాడు. రాబోయే సీనియర్ టెస్ట్ జట్టులో మూడో స్థానం కోసం పోటీపడుతున్న సాయి సుదర్శన్, పడిక్కల్‌లు ఇద్దరూ ఈ మ్యాచ్‌లో రాణించడం విశేషం. నాలుగు రోజుల ఈ మ్యాచ్ ఆఖరి రోజున భారత్ విజయం సాధించే దిశగా అడుగులు వేస్తోంది.

# విరాట్, రోహిత్‌ల తర్వాతి సూపర్‌స్టార్ వచ్చేశాడు..

## యువ ఆటగాడిపై క్లూసెనర్ ప్రశంసలు!



భారత క్రికెట్‌లో విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ శకం తర్వాత ఎవరు ఆ స్థాయికి ఎదుగుతారనే చర్చ సాగుతోంది. ఈ నేపథ్యంలో దక్షిణాఫ్రికా మాజీ ఆల్‌రౌండర్ లాన్స్ క్లూసెనర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. భారత క్రికెట్ తర్వాతి సూపర్‌స్టార్ ఇప్పటికే వచ్చేశాడని, యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీని ఉద్దేశించి పేర్కొన్నాడు. మరోవైపు శుభ్‌మన్ గిల్ భారత జట్టును చాలా ఏళ్ల పాటు ముందుండి నడిపించగలడని విశ్వాసం వ్యక్తం చేశాడు. అబుదాబి టీ10 లీగ్‌లో అరేబియన్ ఏసెస్ జట్టుకు ప్రధాన కోచ్‌గా వ్యవహరిస్తున్న క్లూసెనర్.. ఓ కార్యక్రమం సందర్భంగా ఐఏఎన్ఎస్‌తో మాట్లాడాడు. కోహ్లీ, రోహిత్ భారత క్రికెట్‌కు చేసిన సేవలను గుర్తు చేస్తూనే, దిగ్గజ ఆటగాళ్లు తప్పుకున్నంత మాత్రాన ఆట ఆగిపోదని అన్నాడు. "విరాట్, రోహిత్ గతంలో ఎంత గొప్పగా ఆడినా.. సరైన సమయం వచ్చినప్పుడు వారు ఆటకు వీడ్కోలు పలకాల్సిందే. కానీ క్రికెట్ గొప్పదనం ఏమిటంటే.. అది నిరంతరం కొనసాగుతుంది. ఒక్కోసారి మరింత బలపడుతుంది కూడా" అని క్లూసెనర్ పేర్కొన్నాడు. సచిన్ టెండూల్కర్ రికార్డులను ఎవరూ బద్దలు కొట్టలేరని గతంలో అనుకునేవారని, కానీ ఇప్పుడు ఆ రికార్డులకు కూడా సవాళ్లు ఎదురవుతున్నాయని గుర్తు చేశాడు. ఆటగాళ్లు వస్తుంటారు, వెళుతుంటారని.. దిగ్గజాలు ఆటకు దూరమైనప్పుడు బాధ కలిగినా, వారి స్థానంలోకి రావడానికి యువకులు సిద్ధంగా ఉంటారని వివరించాడు.

## గిల్‌పై విశ్వాసం

శుభ్‌మన్ గిల్‌ను క్లూసెనర్ ప్రశంసలతో ముంచెత్తాడు. బ్యాటర్‌గా గిల్ అద్భుతమైన ఆటగాడని, నాయకుడిగా కూడా తనదైన ముద్ర వేయగలడని అన్నాడు. అయితే బ్యాటర్‌గా తన పాత్రను, కెప్టెన్‌గా తన బాధ్యతలను వేర్వేరుగా చూడటం గిల్‌కు కీలకమని సూచించాడు. "గిల్ సరైన వ్యక్తి అనే విషయంలో నాకు ఎలాంటి సందేహం లేదు. బ్యాటింగ్‌లో అతడు అద్భుతమైన సూపర్‌స్టార్. బ్యాటర్‌గా, కెప్టెన్‌గా వేర్వేరు పాత్రలను నిర్వహించడం గిల్ నేర్చుకోవాలి. గొప్ప కెప్టెన్లంతా ఈ విషయంలో విజయం సాధించారు" అని తెలిపాడు. కెప్టెన్సీ అనేది నిరంతరం నేర్చుకునే ప్రక్రియ అని, అనుభవజ్ఞులైన నాయకులు కూడా రోజూ కొత్త విషయాలు నేర్చుకుంటారని క్లూసెనర్ పేర్కొన్నాడు.

# ఏఐటీఏ ఎన్నికల్లోకి సానియా, భూపతి... లియాండర్ పేస్ అధ్యక్ష ఆశలకు గండి!

భారత టెన్నిస్‌లో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. దిగ్గజ క్రీడాకారులు సానియా మీర్జా, మహేశ్ భూపతి అఖిల భారత టెన్నిస్ సంఘం పరిపాలనలోకి అడుగుపెట్టేందుకు సిద్ధమయ్యారు. మరోవైపు, అధ్యక్ష పదవిని ఆశించిన మరో లెజెండ్ లియాండర్ పేస్ అనూహ్యంగా రేసు నుంచి తప్పుకున్నట్టయింది. వివరాల్లోకి వెళితే, AITAలో స్పోర్ట్స్ పర్సన్ ఆఫ్ అవుట్‌స్టాండింగ్ మెరిట్ ప్రతినిధుల ఎన్నిక కోసం సానియా, భూపతి నామినేషన్లు దాఖలు చేశారు. అయితే, అధ్యక్ష పదవికి పోటీ చేస్తారని భావించిన లియాండర్ పేస్ మాత్రం నామినేషన్ వేయలేదు. AITA సవరించిన నిబంధనల ప్రకారం, అధ్యక్ష పదవికి పోటీ చేయాలంటే ఓటింగ్ ప్రతినిధిగా ఎన్నికై ఉండాలి లేదా గతంలో కార్యవర్గంలో పనిచేసి ఉండాలి. ఈ రెండు అర్హతలు లేని పేస్‌కు SOM ఎన్నికల ద్వారా రావడం ఒక్కటే మార్గం. కానీ పేస్ నామినేషన్ దాఖలు చేయకపోవడంతో అధ్యక్ష పదవికి అనర్హుడయ్యాడు. గతంలో బెంగాల్ టెన్నిస్ సంఘం పేస్‌ను అధ్యక్ష అభ్యర్థిగా ప్రకటించిన విషయం తెలిసిందే. సానియా, భూపతితో పాటు అంకితా భాంబ్రి, ప్రస్తుత డేవిస్ కప్ కోచ్ ఆశుతోష్ సింగ్, విశాల్ ఉప్పల్ సహా మొత్తం 8 మంది మాజీ ఆటగాళ్లు SOM ఎన్నికల బరిలో నిలిచారు. క్రీడా సమాఖ్యల నిర్వహణలో మాజీ ఆటగాళ్లకు ప్రాతినిధ్యం కల్పించాలనే లక్ష్యంతో ఈ ఎన్నికలు నిర్వహిస్తున్నారు. దీని ప్రకారం నలుగురు ఓటింగ్ ప్రతినిధులను జనరల్ బాడీకి, ఇద్దరిని ఎగ్జిక్యూటివ్ కమిటీకి ఎన్నుకుంటారు.

Publisher & Printer: G. Narendra, C.G. Palem, Bapatla, Bapatla District